# జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫ్యాక్టరీల నిర్ధారణ మరియు శ్రేణి నిర్ణయ పథకం

(2014 అక్టోబరు 14 సవరణ ప్రకారం)

# జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫ్యాక్టరీల నిర్ధారణ మరియు శ్రేణి నిర్ణయ పథకం

**1.0. పరిధి మరియు ఉద్దేశం**

1.1 భారతదేశంలోని ఆధునీకరించిన జిన్నింగ్ (గింజ నుంచి పత్తిని విడదీయడం) మరియు ప్రెస్సింగ్ (పత్తి బేలు తయారుచేయడం) ఫాక్టరీల నిర్ధారణ మరియు శ్రేణి నిర్ణయానికి అవసరమైన వాటిని ఈ పథకం తెలియచేస్తుంది.

**'టెక్స్‌టైల్స్ కమిటీ' ద్వారా నిర్వహించే ఈ పథకం ఉద్దేశం:**

ఎ) జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలు తమ ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసుకొని, వాటి మెరుగుదలకు ఉన్న అవకాశాలను గుర్తించేవిధంగా తోడ్పడటం.

బి) జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలు తమ విశ్వసనీయతను పెంచేందుకు రేటింగ్‌ను ప్రభావితపరిచే మార్కెటింగ్ సాధనంగా ఉపయోగించుకొనేవిధంగా తోడ్పడటం.

సి) పత్తి వ్యాపారులు తమ నాణ్యత అవసరాలకు అనుగుణమైన రీతిలో జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలను ఎంపిక చేసుకోవడంలో తోడ్పడటం.

డి) నూలు మిల్లులు తమ అవసరాలకు అనుగుణంగా దూదిని సమకూర్చుకోవడానికి తగు జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలను ఎంచుకోవడంలో తోడ్పడటం.

ఇ) పరిశుద్ధ దూది కలిగిన బ్రాండ్‌ను సృష్టించడంలో తోడ్పడటం.

1.2. ఈ పథకం కింద నిర్ధారణ మరియు రేటింగ్ అనేది స్వచ్ఛందం.

**2.0 నిర్వచనాలు**

2.1 నిర్ధారణ (Assessment)

ఈ పథకంలో ప్రతిపాదించిన ప్రమాణాల ప్రకారం ఆధునిక జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలో మౌలిక సదుపాయాలు మరియు నిర్వహణ పద్ధతులను మూల్యాంకన చేయడం.

2.2 జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ

గింజ పత్తి నుంచి దూది, తరవాత దూదిని ప్రెస్సింగ్‌తో బేల్స్‌గా రూపొందించడంలో చట్టబద్ధమైన గుర్తింపు కలిగిన ఫాక్టరీ.

**గమనిక:** పత్తిగింజ నుంచి నూనె తీసే సదుపాయం కూడా జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ పరిసరాల్లోనే ఉన్నప్పటికీ, మూల్యాంకన పరిధి కేవలం జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ క్రియలకే పరిమితం చేయాలి.

2.3 ఆధునీకరించిన జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ అనుబంధం-1లోని జాబితాలో ఉన్న కనీస నిర్దేశిత ప్రమాణాలను పాటించేది.

**2.4 మౌలిక సదుపాయాల పరామితులు**

ఈ పథకంలో నిర్ధారణకు వచ్చే ఆధునీకరించిన జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలో మౌలిక సదుపాయాలకు సంబంధించిన పరికరాలు అంటే యంత్రాలు, సివిల్ మరియు ఇతర మౌలిక సదుపాయాలు.

**2.5 నిర్వహణ పరామితులు**

ఈ పథకంలో నిర్ధారణకు ఎన్నుకున్న ఆధునీకరించిన జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ దూదిలోని మలినాల శాతం అంచనాతోపాటు అనుసరించే నిర్వహణ పద్ధతులు మరియు పని విధానాలు.

**2.6 శ్రేణి నిర్ణయం (రేటింగ్)**

2.6.1 మౌలిక సదుపాయాల పరామితులు మరియు యాజమాన్య నిర్వహణ పద్ధతులను నిర్ధారించి, ఈ పథకంలో పేర్కొన్న ప్రమాణాలకు అనుగుణంగా శ్రేణి నిర్ణయం (రేటింగ్) జరిగి ఆధునీకరించిన జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీల వర్గీకరణ విధానమే ఈ 'రేటింగ్'.

2.6.2 జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ రేటింగ్ అంటే దాని సామర్థ్యం అంచనా. ఈ రేటింగ్ నాణ్యమైన పత్తి ఉత్పత్తిలో ఫాక్టరీ సామర్థ్యాన్ని తెలుస్తుంది. అయిదే అది ఉత్పత్తికి సర్టిఫికేషన్‌గా అన్వయించుకోకూడదు.

**2.7 హైబ్రిడ్ ఫాక్టరీ**

ఆధునిక జిన్నింగ్ సదుపాయాలు కలిగిన ఫ్యాక్టరీ, సంప్రదాయ / పురాతన జిన్నింగ్ సదుపాయాలు కలిగిన ఫ్యాక్టరీ ఒకే ఆవరణలో ఉంటూ ఉమ్మడిగా ఉత్పత్తి అవసరాలను తీర్చుకోవడం.

**3.0 పరిపాలనపరమైన సదుపాయాలు**

3.1. నిర్ధారణ మరియు శ్రేణి నిర్ణయ విభాగం (Assessment and Rating Cell- ARC)

జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలో నిర్ధారణ మరియు రేటింగ్‌కు సంబంధించి దరఖాస్తులు మరియు దస్తావేజులను ప్రక్రియ చేయడానికి టెక్స్‌టైల్స్ కమిటీ ప్రత్యేక వి

భాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం యొక్క ముఖ్య కార్యకలాపాలు 1) ఔత్సాహిక జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీల దరఖాస్తులను స్వీకరించడం 2) ఫాక్టరీల నిర్ధారణకు సంబంధించిన విషయాలను పరిశీలించడానికి ఇద్దరు సభ్యులు గల బృందాన్ని పంపడం 3) ఈ ఇద్దరు సభ్యుల బృందం ఇచ్చిన అంచనాల నివేదికను సంకలనం చేసి అనుమతి కోసం 'సాంకేతిక శ్రేణి నిర్ణయ కమిటీ (Technical Rating Award Committee- TRAC)కి అందచేయడం.

**3.2 సాంకేతిక శ్రేణి నిర్ణయ కమిటీ** (Technical Rating Award Committee)

తమకు అప్పగించిన మేరకు ఈ కమిటీ, నిర్ధారించిన జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీల రేటింగ్‌ను విధానపరంగా నిర్ణయిస్తుంది. అవసరం అయినప్పుడు పథకానికి సంబంధించి తగు సవరణలు, సూచనలు చేస్తుంది. సరైన రేటింగ్ నిర్ధారించేందుకు ఈ టిఆర్ఏసి, ఇద్దరు సభ్యుల బృందం పంపిన నివేదిక మరియు ఎఆర్‌సి సంకలన నివేదికలను పరిశీలిస్తుంది. టిఆర్ఏసికి ముంబయిలోని టెక్స్‌టైల్స్ కమిటీ కార్యదర్శి నేతృత్వం వహిస్తారు. ఆయనతోబాటుగా క్రింద పేర్కొన్న సభ్యులు కూడా కమిటీలో ఉంటారు.

1) జాయింట్ టెక్స్‌టైల్ కమిషనర్ లేదా ఆయన ప్రతినిధి (అదీ డిప్యూటీ డైరెక్టర్ హోదాకు తక్కువ కాని వ్యక్తి)

2) కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ప్రతినిధి.

3) డైరెక్టర్ (ఇపిక్యూఎ) లేదా ఆయన ప్రతినిధి (అదీ టెక్స్‌టైల్ కమిటీ నుంచి డిప్యూటీ డైరెక్టర్ హోదాకు తక్కువ కాని అధికారి)

4. అవసరమైతే జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీని సందర్శించిన ఆఫీసర్ /ర్లను ఆహ్వానితుడు/లుగా ఉంచవచ్చు.

సమావేశాలకు మరింత మందిని ఆహ్వానించే అధికారం టెక్నికల్ రేటింగ్ అవార్డు కమిటీకి ఉంది. రేటింగ్‌ల నిర్ధారణ కోసం సాధ్యమైనంత తరుచుగా ఈ కమిటీ సమావేశం కావాల్సి ఉంటుంది.

**3.3 నిపుణుల ప్యానల్**

సంబంధిత అర్హత, పరిజ్ఞానం, అనుభవం, శిక్షణ తదితరాల ఆధారంగా టెక్స్‌టైల్ కమిటీ ఓ నిపుణుల ప్యానల్‌ను ఏర్పాటు చేసింది. ఈ నిపుణులు అక్కడికక్కడే నిర్ధారణ కోసం (ఆన్ ది స్పాట్) జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలను సందర్శించవచ్చు.

**4.0 నిర్ధారణకు అర్హత**

4.1 టిఎంసి లేదా టియుఎఫ్ఎస్ లేదా సొంత నిధులతో ఆధునికీకరించుకున్న 'జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ' ఏదైనా సరే అనుబంధం-1లో సూచించిన కనీస ప్రమాణాలను పాటిస్తున్న పక్షంలో టెక్స్‌టైల్ కమిటీ నిర్ధారణకు అర్హత సాధిస్తుంది.

4.2 ఒకే ఆవరణలో ఉన్న సంప్రదాయ, ఆధునిక సదుపాయాలు కలిగిన హైబ్రీడ్ జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీలు నిర్ధారణ (అసెస్‌మెంట్)కు అర్హమైనవి కావు.

**5.0 రిజిస్ట్రేషన్ మరియు నిర్ధారణకు దరఖాస్తు**

నిర్ధారణ, రేటింగ్ పట్ల ఆసక్తి ఉండి, అనుబంధం-1లో నిర్దేశించిన ప్రమాణాలను అందుకున్న జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలు, అనుబంధం-2లో పేర్కొన్న ప్రొఫార్మాలో టెక్స్‌టైల్ కమిటీకి రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5000/- మరియు నిర్ణయించిన రేటింగ్ ఫీజు చెల్లించాలి.

జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ దరఖాస్తులో పేర్కొన్న విధంగా అర్హతలు సాధించిందా లేదా అని అసెస్‌మెంట్ మరియు రేటింగ్ విభాగం నిశితంగా పరిశీలిస్తుంది. నిర్ధారణకు అనువైందని ప్రాథమికంగా రూఢీ పడినట్లయితే అప్పుడు దరఖాస్తును రిజిస్టర్ చేస్తారు.

**6.0. రేటింగ్ ఫీజు**

మూడేళ్ళ కాలానికి రేటింగ్ ఫీజు రూ.35,000, పన్నులు అదనం. మూడేళ్లలో ఒక మధ్యంతర నిఘా సందర్శన కూడా కలిపి ఈ ఫీజు వసూలు చేస్తారు.

**7.0 నిర్ధారించే విధానం**

7.1. నిర్ధారణ బృందం జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ సందర్శన

జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ సందర్శన కోసం ఎంపిక చేసుకొన్న ప్యానల్ నుంచి ఇద్దరు నిపుణుల బృందాన్ని అసెస్‌మెంట్ మరియు రేటింగ్ విభాగం పంపిస్తుంది.

అసెస్‌మెంట్ కోసం వచ్చిన సమయానికి ఆ యూనిట్‌కి పని చేయగలిగే సామర్థ్యం ఉందని, బృందం నిర్ధారించాలి. అంతేకాదు నిర్ధారణకు అవసరమైన ప్రమాణాలు ఉపయోగంలో ఉండేవిధంగా ఆ యూనిట్ ఉందని కూడా నిర్ధారించాలి. మౌలిక సదుపాయాల్లో ప్రతి అంశాన్ని బృందం పరిశీలించాలి. ఈ పరిశీలనలో యంత్రాలు, సివిల్ అంశాలు మొదలైనవన్నీ ఉంటాయి. సందర్శన సమయంలో యూనిట్‌లో పని పరిస్థితులు, అక్కడ అనుసరిస్తున్న యాజమాన్య విధానాలను కూడా పరిగణ

నలోకి తీసుకుంటారు.

మలినాల కోసం ప్రక్రియ చేసిన పత్తి శాంపిల్‌ను ప్రత్యక్షంగా పరీక్షించాలి. మౌలిక సదుపాయాలు మరియు యాజమాన్య నిర్వహణ పరామితుల వివరాలు అసెస్‌మెంట్ ఫార్మాట్ (అనుబంధం-3)లో ఇవ్వబడ్డాయి. సందర్శన బృందం, ఒక్కొక్క మౌలిక మరియు నిర్వహణ పరామితులను పరిశీలించి, దూదిలోని మాలిన్యాన్ని పరిగణనలోకి తీసుకుంటూ మార్కులు వేయాలి. మౌలిక సదుపాయాలు మరియు నిర్వహణ పరామితుల మార్కుల విధానం అనుబంధం-4లోని టేబుల్-I మరియు టేబుల్-IIలో ఇవ్వబడింది. సదరు బృందం, అనుబంధం-3 ప్రకారం నిర్ధారణ నివేదికను రూపొందించి నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం (ఎఆర్‌సి)కు నివేదించాలి.

7.2 మలినాలను గుర్తించడం కోసం ప్రత్యక్ష పరిశీలన అక్కడ ఉన్న బేల్స్‌లో నుంచి మచ్చుకు ఒకటి తీసుకొని నిర్ధారణ బృందం పరిశీలించాలి. ఎంపిక చేసుకొన్న బేల్ గింజపత్తి దశ నుంచి బేల్ వరకు ఆరోజు ప్రాసెస్ చేసినదై ఉండాలి.

బృందం సమక్షంలో సుమారు 25 కేజీల దూదిని (గింజ నుంచి తీసిన పత్తి) బేల్ నుంచి తీసి విస్తరించిన ప్లాట్‌ఫాంపై పరచాలి. అప్పుడే మలినాలు గుర్తించడం సులువు అవుతుంది. నిర్ధారణ బృందం, పత్తిలోని మలినాలను ప్రత్యక్షంగా పరిశీలించి, విశ్లేషించి అనుబంధం-4లో పేర్కొన్న విధానాలకనుగుణంగా మార్కులు వేయాలి.

## 7.3 ఫోటోగ్రాఫ్‌లు

అవసరమైన పక్షంలో మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫోటోలను అంచనా కోసం వచ్చిన బృందం తీసుకోవచ్చు. ఈ ఫోటోలు నివేదికలకు మరింత బలం చేకూర్చేవిధంగా ఉంటాయి. మేనేజ్‌మెంట్ ప్రమాణాలకు సంబంధించిన ఫోటోలు కూడా ఈ బృందం అదనంగా తీసుకోవచ్చు. నివేదికతోపాటు ఫోటోలనూ అసెస్‌మెంట్ మరియు రేటింగ్ విభాగంకు (ఎఆర్‌సి) సమర్పించాలి.

## 8.0 సంకలనం

బృందం ఇచ్చిన నివేదికను నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం సూక్ష్మంగా పరిశీలించాలి. మౌలిక పరామితులు మరియు నిర్వహణ పరామితులకు సంబంధించిన మార్కులను శాతాల్లో గణిస్తూ, కనీస అర్హత ప్రమాణాల ఆవశ్యక అర్హత ప్రమాణాల పూరణను సంకలనం చేయాలి. ఒకవేళ ఫాక్టరీ 80% లేదా అంతకంటే ఎక్కువ స్కోర్ సాధిస్తే, 4 స్టార్ లేదా 5 స్టార్ రేటింగ్ పొందడానికి అవసరమయ్యే ప్రమాణాలను పొందడానికి ఆ ఫాక్టరీ పాటించాల్సిన ఆదేశాలను సంకలనం చేయాలి. నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం సంకలన పరచిన నివేదికకు తోడు తమ సిఫార్సులతో (అనుబంధం-5) కూడిన నిర్ధారణ నివేదికను టిఆర్‌ఎసికి సమర్పించాలి.

## 9.0. రేటింగ్ నిర్ధారణ

9.1. ఫాక్టరీని సందర్శించిన బృందం ఇచ్చిన నిర్ధారణ నివేదికతోపాటు అసెస్‌మెంట్ మరియు రేటింగ్ విభాగం సిఫార్సులతో కూడిన నివేదికను కూడా టెక్నికల్ రేటింగ్ అవార్డు కమిటీ సమీక్షిస్తుంది. తదుపరి సరైన రేటింగ్ ఇస్తుంది. అనుబంధం-1లో పేర్కొన్న ప్రమాణాలకు లోబడి ఇదంతా ఉంటుంది.

9.2. టెక్నికల్ రేటింగ్ అవార్డు కమిటీ ఇచ్చిన రేటింగ్‌తోపాటు నిర్ధారణ స్థాయీ నివేదికను 'అసెస్‌మెంట్ మరియు రేటింగ్ విభాగం సంబంధిత జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీకి తెలియచేస్తుంది.

9.3.1. అనుబంధం-1లో పేర్కొన్న ప్రమాణాలకు అనుగుణంగా జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫాక్టరీ ఎలాంటి రేటింగ్‌కు అర్హత సాధించకుంటే, సదరు ఫాక్టరీకి తాత్కాలిక రేటింగ్ స్థాయిని, నిర్ధారణ స్థాయి నివేదిక జతచేసి ఇస్తారు. అవసరమైన ప్రమాణాలను మెరుగుపర్చుకున్న తరవాత తగినంత ఫీజు చెల్లించి మళ్లీ నిర్ధారణ కోసం ఆయా కంపెనీలు కోరవచ్చు.

9.3.2 ఫాక్టరీ ఒకవేళ స్టార్ రేటింగ్‌కు అర్హత సాధించి కనీస అర్హత ప్రమాణాలలో ఏదైనా ఒక దానిని పూర్తిచేయకుంటే కొంతకాలం కోసం సింగిల్ స్టార్ ఇవ్వవచ్చు.

ఈ నిర్దేశిత కాలంలో ఫాక్టరీ అవసరమైన మార్పులు చేసుకొని ఆ ప్రమాణాలను పూర్తి చేసుకోవాలి.

9.3.3 అవసరమైన ప్రమాణాలను పూర్తిచేసిన తరవాత ఆ ఒక్క పరామితికి మార్కులు ఇచ్చిన పిదప తదనుగుణమైన స్టార్ రేటింగ్ ఇవ్వాలి.

9.3.4 అలా కాకుండా నిర్దేశిత కాలపరిమితిలోగా అవసరమైన వాటిని పూర్తిచేయని పక్షంలో ఏక నక్షత్ర రేటింగ్ అవార్డును (Single Star Rating) వెనక్కి తీసుకోవాలి.

9.4 ఎల్‌టి/హెచ్‌టి లైన్లు ఫాక్టరీ ఆవరణ మీదుగా వెళుతుంటే ఆ లైనుపై సరైన సూచన (Advisory note) చేస్తూ తదనుగుణమైన స్టార్ రేటింగ్ ఇవ్వాలి. ఆ నోట్‌లో స్టార్ రేటింగ్‌కు అవసరమైన పనులు పూర్తిచేయాలని సూచించాలి.

## 10.0 రేటింగ్ ధృవపత్రం / తాత్కాలిక రేటింగ్ స్థాయిపై లేఖ:

అర్హత సాధించిన ఫాక్టరీలకు రేటింగ్ ధృవపత్రం లేదా

తాత్కాలిక రేటింగ్ స్థాయి ఇవ్వబడుతుంది. దీనిలో రేటింగ్ స్థాయి లేదా తాత్కాలిక రేటింగ్ స్థాయి జారీ చేసిన తేదీ, కాల వ్యవధి పేర్కొనబడుతుంది. ఆసక్తి ఉన్న నూలు మిల్లులు, పత్తి వ్యాపారులు / వర్తకులు, జిన్నింగ్ ఫ్యాక్టరీలు తెలుసుకొనేందుకు వీలుగా సంబంధిత సమాచారాన్ని టెక్స్‌టైల్స్ కమిటీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

**11.0 రేటింగ్‌తో ప్రయోజనాలు**

జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫ్యాక్టరీకి ఇచ్చే స్టార్ రేటింగ్ ఒక గుర్తింపుగా, దూది నాణ్యతకు సంబంధించి ఒక మార్కెటింగ్ సాధనంగా ఉపయోగపడుతుంది. అంతే గాని దీనిని పత్తి బేల్‌పైన ఉత్పత్తి ధృవపత్రం(Product Certificate)గా మాత్రం ఉపయోగించరాదు.

**12.0 రేటింగ్ కాలపరిమితి మరియు నిఘా సందర్శన**

12.1.1 ఒకసారి స్టార్ రేటింగ్ ఇస్తే మూడేళ్ల వరకు అమలులో ఉంటుంది. అయితే ఈ మూడేళ్లలో ధృవపత్రం పొందిన ఫ్యాక్టరీకి ఒక మధ్యంతర నిఘా సందర్శనను టెక్స్‌టైల్స్ కమిటీ ఏర్పాటు చేస్తుంది. యంత్రాలు, సివిల్ మరియు ఇతర మౌలిక సదుపాయాలు అలాగే కొనసాగుతున్నాయని తేల్చేందుకు ఈ నిఘా సందర్శన ఉంటుంది. ఒకవేళ అవసరమైతే అదనపు సందర్శనలు కూడా ఉంటాయి.

12.1.2 నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం (ఎఆర్‌సి) నిపుణుల పానెల్ నుంచి అధికారి/రులను మధ్యంతర నిఘా సందర్శనకు పంపుతుంది.

12.1.3. అధికారి/రులు, యంత్రాలు, సివిల్ మరియు మౌలిక సదుపాయాలు కొనసాగుతున్నాయా లేదా అన్నది తనిఖీ చేసి నిఘా సందర్శన నివేదికను నిర్దేశిత ఫార్మాట్ (అనుబంధం-6)లో అందచేస్తారు.

12.2.1. ఫ్యాక్టరీలకు ఏడాదికి మాత్రమే తాత్కాలిక రేటింగ్ స్థాయిని మంజూరు చేస్తారు. ఫ్యాక్టరీలు, నిర్ధారణ స్థాయి నివేదికలో సూచించిన పరామితులను మెరుగుపర్చుకున్న తరవాత మళ్లీ నిర్ధారణకు ఏడాది లోపే అభ్యర్థించాలి. అయితే ఫ్యాక్టరీని బట్టి అధ్యయానుసారంగా తాత్కాలిక స్థాయిని కొనసాగించవచ్చు.

12.2.2. పునఃనిర్ధారణ తరవాత ఇచ్చిన 'స్టార్ రేటింగ్, ఆ ఫ్యాక్టరీకి తాత్కాలిక రేటింగ్ స్థాయి ఇచ్చిన తేదీ నుంచి తతిమా మూడేళ్ల కాలానికి అమలులో ఉంటుంది.

12.3.1 స్టార్ రేటింగ్‌కు అర్హత పొంది, కనీస అర్హత ప్రమాణాలలో ఏదో ఒక దానిని పూరించని ఫ్యాక్టరీలకు ఇచ్చే సింగిల్ స్టార్ రేటింగ్ యొక్క కాలపరిమితి, కాలానుగుణంగా నిర్ణయించబడుతుంది.

12.3.2. అవసరమైన ప్రత్యేక పరామితిని పూర్తిచేసిన తరవాత స్టార్ రేటింగ్ అర్హత ఉందని నిర్ధారిస్తే ఆమేరకు రేటింగ్ ఇస్తారు. అయితే మొత్తం కాలపరిమితి మూడేళ్లు అయినప్పటికీ సింగిల్ స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ తొలిసారి జారీ చేసిన తేదీ నుంచి ప్రస్తుతం రేటింగ్ ఇచ్చిన సమయం వరకు జరిగిన కాలాన్ని అందులో నుంచి మినహాయించి మిగిలిన కాలానికి ఈ స్టార్ హోదా అమలులో ఉంటుంది.

**13.0. నిర్ధారణ రేటింగ్ విలువ తగ్గింపు**

మధ్యంతర నిఘా సందర్శన / అదనపు సందర్శన తరవాత, గతంతో పోలిస్తే, ఒక ఫ్యాక్టరీలో నాణ్యతపరంగా అంటే మౌలిక సదుపాయాలు, నిర్వహణ విధానాల్లో నాణ్యత తగ్గినట్లు భావిస్తే నిర్ధారణ రేటింగ్ విలువ తగ్గినట్లుగా భావిస్తారు. నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం ప్రస్తుతం ఆ ఫ్యాక్టరీ తక్కువ విలువ(Down grading)తో ఉందని తెలియచేస్తూ తదుపరి చర్యల కోసం టిఆర్‌ఎసికి తెలియచేస్తుంది. టిఆర్‌ఎసి వెనువెంటనే తగు నిర్ణయం తీసుకుంటుంది. రేటింగ్ తగ్గింపు లేదా పూర్తిగా ఉపసంహరణ అన్నది కేసును బట్టి ఉంటుంది. టెక్స్‌టైల్స్ కమిటీ సెక్రటరీ / డైరెక్టర్ సంతకంతో సంబంధిత సమాచారాన్ని ఫ్యాక్టరీకి తెలియచేస్తారు. టెక్స్‌టైల్స్ కమిటీ వెబ్‌సైట్‌లోనూ ఉంచుతారు.

**14.0. రేటింగ్ పునరుద్ధరణ**

14.1 అనుమతించిన కాలపరిమితి లోగానే రేటింగ్ పునరుద్ధరణ కోసం సర్టిఫికెట్ ఉన్న జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలు దరఖాస్తు చేసుకోవాలి. కాలపరిమితి మగిసిన ఏడాది తరవాత పునరుద్ధరణ దరఖాస్తు చేసుకుంటే దేనికది విడిగా కేసును బట్టి నిర్ణయం తీసుకుంటారు.

14.2 మూడేళ్ల కాలానికి రేటింగ్ పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకుంటే దానికి వసూలు చేసే ఫీజు రూ.25,000/- దీనికి పన్నులు అదనం. ఈ మూడేళ్ల కాలంలో ఒకసారి మధ్యంతర నిఘా సందర్శనకు అయ్యే ఫీజు కూడా ఇందులోనే ఉంటుంది.

14.3. పునరుద్ధరణ సందర్శన కోసం నిపుణుల పానల్ నుంచి ఇద్దరు మెంబర్లు గల అధికారుల బృందాన్ని నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం (ఎఆర్‌సి) పురమాయిస్తుంది.

14.4. యంత్రాలు, సివిల్ మౌలిక సదుపాయాలు వంటివి చెప్పినట్లు కొనసాగుతున్నాయా లేదా అన్నది తనిఖీ చేసి అనుబంధం-7లో సూచించిన ఫార్మాట్‌లో నివేదికను

సభ్యులు నివేదిస్తారు. సందర్శించిన టీమ్ సభ్యులు ఫ్యాక్టరీలు అదనంగా సమకూర్చిన / మౌలిక సదుపాయాల్లో మెరుగుదల వంటివి కూడా తనిఖీ చేసి నివేదికలో చేరుస్తారు.

14.5 పునరుద్ధరణ కోసం సందర్శించిన టీమ్ ఇచ్చిన నివేదికను నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం తనిఖీ చేసి డైరెక్టర్ (ఇపిక్యూఎ)కు సిఫార్సు చేస్తుంది.

14.6 సందర్శన సందర్భంగా బృందం కనుగొన్న అంశాలు, నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం సిఫార్సుల ఆధారంగా, డైరెక్టర్ (ఇపిక్యూఎ) ఫ్యాక్టరీ పునరుద్ధరణ లేదా ఇచ్చిన స్టార్ రేటింగ్‌ను ఆమోదిస్తారు.

14.7 సదరు ఆమోదం తరవాత స్టార్ రేటింగ్‌ను పునరుద్ధరిస్తూ నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం (ఎఆర్‌సి), సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తుంది. అది తరవాత మూడేళ్ల కాలానికి వరిస్తుంది. మొదట్లో సర్టిఫికెట్ జారీ చేసిన పద్ధతుల్లోనే మధ్యంతర నిఘా సందర్శన కూడా ఉంటుంది.

14.8 రేటింగ్ పునరుద్ధరణ జరగకుంటే, అదే విషయాన్ని అందుకు దారితీసిన కారణాలతో ఫ్యాక్టరీకి 'ఎఆర్‌సి' తెలియచేస్తుంది.

**15.0 అధిక రేటింగ్‌కు నిర్ధారణ**

15.1 స్టార్ రేటింగ్ పొందిన జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలు మౌలిక సదుపాయాలు, నిర్వహణ పద్ధతులు మెరుగుపర్చుకున్న తరవాత, బృందం యొక్క మధ్యంతర నిఘా సందర్శనలో కాని, పునరుద్ధరణ సందర్శనలో గాని అత్యున్నత స్టార్ రేటింగ్‌కు దరఖాస్తు చేసే స్వేచ్ఛ ఉంది. అలా కాకుండా అత్యున్నత స్టార్ రేటింగ్ గురించి ఫ్యాక్టరీలు, స్టార్ రేటింగ్ పొందిన కాల వ్యవధిలోనే, తగినంత పునఃసందర్శన రుసుము చెల్లించి తమంతటతామే తాజాగా నిర్ధారణ కోరవచ్చు.

15.2 అత్యున్నత స్టార్ రేటింగ్ అభిలాషించే ఫ్యాక్టరీ తమ మౌలిక సదుపాయాలు మరియు / లేదా నిర్వహణ పద్ధతుల మెరుగుదలను సూచిస్తూ తాజా నిర్ధారణ కోసం అభ్యర్థించవచ్చు. అయితే సదరు అభ్యర్థన లేఖను ముందస్తుగా పంపుకోవాలి.

15.3 అభ్యర్థన పత్రం అందగానే నిర్ధారణ మరియు రేటింగ్ విభాగం నిపుణుల బృందంలోని అధికారి/రులను తాజా నిర్ధారణ కోసం పంపే ఏర్పాటు చేస్తుంది.

15.4 అలా ఫ్యాక్టరీని సందర్శించిన అధికారులు లేఖలో పేర్కొన్నవిధంగా మెరుగుదల జరిగిందా లేదా అన్నది తెలుసుకోవాలి. ఫ్యాక్టరీ చెప్పినట్లుగా మెరుగుదలను గమనించిన పక్షంలో అదే విషయాన్ని, సంబంధిత ఫోటోలను జతపరుస్తూ అనుబంధం-3 ప్రకారం బృంద సందర్శన నివేదిక సమర్పించాలి. నిర్ధారణ మరియు రేటింగ్ ప్రమాణాల ప్రకారం ఆరంభంలో ఇచ్చినట్లుగానే తగు రేటింగ్‌ను మంజూరు చేయాలి.

15.5 తాజా నిర్ధారణ తరవాత ఇచ్చిన స్టార్ రేటింగ్, ఇంతకు ముందు రేటింగ్ ధృవపత్రం ఇచ్చిన కాలవ్యవధి లోపలే అమలులో ఉంటుంది.

**16.0 పునఃసందర్శనపై అభ్యర్థన, అందుకయ్యే ఫీజు**

16.1. నిర్దేశిత నిర్ధారణ సందర్శన మరియు మధ్యంతర నిఘా సందర్శనతోపాటు అత్యున్నత స్టార్ రేటింగ్ పొందడానికి లేదా తాత్కాలిక రేటింగ్ స్థాయి నుంచి స్టార్ రేటింగ్ పొందడానికి లేదా పరిమిత సింగిల్ స్టార్ రేటింగ్ నుంచి పూర్తిస్థాయి స్టార్ రేటింగ్ పొందడానికి ఫ్యాక్టరీలు పునః సందర్శన కోరవచ్చు.

16.2. పునఃసందర్శన ఫీజు రూ.15,000/-

16.3 రేటింగ్ ధృవపత్రం / తాత్కాలిక రేటింగ్ స్థాయికి సంబంధించి లేఖ ఇచ్చిన రోజు నుంచి ఏడాది లోపు పునః సందర్శనకు ఫ్యాక్టరీ అభ్యర్థించిన పక్షంలో సంబంధిత ఫీజు నుంచి ఒకసారి మినహాయింపు ఇవ్వవచ్చు.

16.4. నిర్ధారణ బృందం ఫ్యాక్టరీని సందర్శించినప్పుడు అది మూసి ఉంటే ఉభయుల అంగీకారం మేరకు మరోరోజు ఫ్యాక్టరీ సందర్శన కోసం కోరవచ్చు. ఇంతకుముందు సందర్శించిన తేదీ నుంచి ఏడాది లోపు పునః సందర్శన కోరుకుంటే ఆ ఫ్యాక్టరీలకు పునఃసందర్శన ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.